సాక్షి
నంద్యాల
బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



పల్లె కన్నీరు పెడుతుందో..!

గ్రామీణ ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఉన్న ఊర్లో పనుల్లేక ప్రజలంతా కన్నీరు పెడుతూ.. దూరంగా నగరాలకు, పట్టణాలకు వలస వెళ్లారు. ..8లో



పూర్వ జన్మ సుకృతం

మహాశివరాత్రి సందర్భంగా శ్రీమల్లికార్జున స్వామికి పాగాలంకరణ చేయడం సంప్రదాయం. ఇది తమ పూర్వ జన్మ సుకృతం అని పృథ్వీ సుబ్బారావు తెలిపారు. ..8లో



పూలు మరింత ప్రియం

కర్నూలు(అగ్రికల్చర్): శివరాత్రి పర్వదినం నేపథ్యంలో పూలు ధరకు రెక్కలొచ్చాయి. బంతి పూలు రూ.100, గులాబీలు రూ.220, చామంతులు ధర రూ.150 ప్రకారం విక్రయించారు.

న్యూస్‌రీల్

ముచ్చుమర్రిలో నిలిచిన నీటి పంపింగ్



కేసీ కాల్వలో తగ్గిన నీటి ప్రవాహం

జూపాడుబంగ్లా: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటి పంపింగ్ నిలిచిపోయింది. దీంతో కేసీ కాల్వలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. కేవలం సుంకేసుల డ్యాం నుంచి 1,600 క్యూసెక్కుల సాగునీరు కేసీ కాల్వకు సరఫరా అవుతున్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 700 క్యూసెక్కుల నీరు చేరుతుంది. ఈ నీటిని నిప్పులవాగుకు 590, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 110 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలన



ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్, చిత్రంలో ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్

శ్రీశైలం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో భద్రతా ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. మంగళవారం డీఐజీ శ్రీశైలం చేరుకుని ముందుగా సీసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. క్షేత్ర పరిధిలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే గుర్తించి అక్కడికి పోలీసు బృందాలు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జ్ ఎస్పీ వివరించారు. దేవస్థానం తరఫున 550 పైగా సీసీ కెమెరాలు ఉండగా అదనంగా పలు ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఉచిత ప్రత్యేక దర్శన క్యూలు, శివదీక్ష స్వాములు క్యూలను ఎస్పీ, డీఎస్పీలతో కలిసి డీఐజీ పరిశీలించారు. వారి వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటితో పార్వేట ముగింపు



రుద్రవరంలో పూజలందుకున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలు బుధవారం రాత్రితో ముగియనున్నాయి. అహోబిలం ఆలయ నిర్వాహకులు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీ రుద్రవరం నుంచి అహోబిలానికి ఉత్సవ మూర్తులు చేరుకోవాల్సి ఉంది. అనివార్య కారణాలు అంటూ నిర్వాహకులు రెండు రోజులు ముందుగానే ఈనెల 26వ తేదీ రాత్రికే పల్లకీని అహోబిలం క్షేత్రానికి చేర్చుతున్నారు. ఆనవాయితీ ప్రకారం ఆరు రోజులు రుద్రవరంలో తెలుపులపై కొలువై పూజలందుకోవాల్సిన అహోబిలేశుడు నాలుగు రోజులకే పరిమితం కానున్నారు. బుధవారం రాత్రి పల్లకీ రుద్రవరం దొర్వి నరసింహ స్వామి ఆలయం నుంచి బయలుదేరి గండ్లేరు సమీపంలోని ఇస్కాన్ టెంపుల్ వద్దకు చేరుకోనుంది. అక్కడ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత గురువారం తెల్లవారుజామున స్వామి అహోబిలం ఆలయానికి చేరుకున్నారు.

ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి

కర్నూలు (హాస్పిటల్): ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి అన్నారు. కర్నూలులోని సలాం ఖాన్ ఎస్టీయూ భవనంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోకారి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించలేదని, 12వ పీఆర్‌సీని నియమించలేదని, డీఏలను మంజూరు చేయలేదని.. ఇలా సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని, లేనిపక్షంలో ఎస్టీయూ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కె.జనార్దన్, గోవిందు, శేఖర్, గోవిందు నాయక్, సురేష్, దేవదాస్ పాల్గొన్నారు.

జయ జయ మహాదేవ శంభో సదా శివ

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో శ్రీగిరికి ప్రత్యేక స్థానం. ఇక్కడ మల్లన్నకు జరిగే విశిష్ట సేవలు మరెక్కడా జరగవు. శ్రీశైలంలో మల్లన్నకు పాగాలంకరణ ఒక విశిష్ట సేవ. మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవ కాలంలో జరిగే ఈ సేవ వెనుక ఎన్నో ఆధ్యాత్మిక అంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. పాగాలంకరుడైన మల్లన్నను చూసేందుకు భక్తుల రెండు కళ్లు చాలవు. శివరాత్రి ఘడియల్లో జాగారణ చేస్తూ ముక్కంటి వైభవాన్ని కనులారా తిలకించి తరించేందుకు భక్తజన కోటి శ్రీగిరికి తరలివస్తోంది. – శ్రీశైలం(టెంపుల్)



నందీశ్వరా.. శివయ్యకు చెప్పవా..
కైలాస ద్వారం వద్ద భక్తుడి పూజలు




మల్లన్న దర్శనానికి .. శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి



గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నేడు మహాశివరాత్రి పర్వదినం

- శ్రీశైలంలో మల్లన్నకు పాగాలంకరణ ప్రత్యేకం
- అర్ధరాత్రి మహారుద్రాభిషేకం.. స్వామిఅమ్మవార్లకు కల్యాణం
- శ్రీగిరికి తరలివస్తున్న భక్తజనం



భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశాన్ని పంచభూతాలుగా పరిగణిస్తారు. వీటి సమ్మేళనమే ఈ భౌతిక ప్రపంచం. ఈ పంచభూతాలకు ప్రతీకలుగా మల్లన్న ఆలయంలోని ఐదు కలశాలు. స్వామివారి గర్భాలయ విమాన గోపురానికి మధ్యలో ఒకటి, నాలుగు మూలల్లో నాలుగు కలశాలు ఉన్నాయి. గర్భాలయ ముఖమండపంపై తొమ్మిది నందులు ఉన్నాయి. ఈ నవ నందులను, ఐదు కలశాలను కలిపి పాగా చుడతారు. 5 కలశాలు, 9 నందులు మొత్తం 14. ఆ 14 లోకాలను ఏలే శ్రీలింగ చక్రవర్తికి ఈ సంఖ్యతో కూడిన పాగాలంకరణ జరగడం విశేషం. తద్వారా 14లోకాలకు మల్లన్న అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని, లోక కల్యాణం జరగాలన్న ఆకాంక్షలను స్వామివారికి భక్తులు తెలియజేయడమే ఈ పాగాలంకరణ వెనుక ఉన్న మరో విశేషం. సాలే గూడు శ్రీకాళహస్తీశ్వర మహాత్యం గురించి తెలియని శివభక్తులు ఉండరు. అందులో శ్రీ అంటే సాలె పురుగు. శివలింగంపై ఎండపడకుండా భక్తితో అది గూడు అల్లుతుంది. తద్వారా పరమశివుడు అనుగ్రహం పొందుతుంది. శ్రీశైల మల్లన్నకు జరిగే పాగాలంకరణ సాలె గూడును పోలి ఉంటుంది. 14 చుట్లు చుట్టిన పాగాలంకరణ దర్శనం వలన 14 ఇంద్రియాలు నిర్మలమైన బాధల నుంచి విముక్తి పొందుతాయన్న ఆధ్యాత్మిక సందేశం ఇందులో ఇమిడి ఉంది. మహా



శివరాత్రి పర్వదినాన బుధవారం రాత్రి 10గంటల నుంచి 12గంటల లోపు లింగోద్భవ సమయంలో పాగాలంకరణ జరుగుతుంది. ఇందుకోసం పృథ్వి వెంకటేశ్వర్లు పాగా వస్త్రంతో శ్రీగిరికి చేరుకున్నారు. పాగాలంకరణ సమయంలో మల్లన్నకు లింగోద్భావకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

వంశ పారంపర్యంగా..

ప్రకాశం జిల్లా చీరాల మండలం జాండ్రపేట హస్తినాపురం గ్రామానికి చెందిన చేనేత కుటుంబం వంశపారంపర్యంగా మల్లన్నకు తలపాగాను తయారు చేస్తోంది. నియమ, నిష్ఠలతో ఈ కుటుంబం పాగాను నేస్తారు. హస్తినాపురం గ్రామాని కి చెందిన వౌలుకుల కందస్వామి మొదట్లో పాగా తయారు చేసేవారు. ఆయనే స్వయంగా వస్త్రాన్ని నేసి కాలినడకన శ్రీశైలం వచ్చే వారు. కందస్వామి మేనల్లుడు పృథ్వి సుబ్బారావు చిన్నతనంలో ఆయనతో కలసి శ్రీశైలం వచ్చే వారు. కందస్వామి వయస్సు మీరాక పూజా కార్యక్రమాలు, పాగాలంకరణలో సహాయ పడేవారు. కందస్వామి అవివాహితుడు. ఈ నేపథ్యంలో పాగాలంకరణ బాధ్యతలను తన వారసుడిగా మేనల్లుడైన పృథ్వి సుబ్బారావును ఎంచుకున్నాడు. సుబ్బారావు తరువాత ఆయన కుమారుడు వెంకటేశ్వర్లు ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్వామి వారికి దిక్కులే వస్త్రాలు. అందుకే పాగాలంకరణ సేవ చేసేవారు దిగంబరంగానే ఉండి కార్యాన్ని పూర్తి చేస్తారు. ఆ సమయంలో ఆలయం, పరిసరాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు.



నేడు పాగాలంకరణ, కల్యాణోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఎనిమిదవ రోజు బుధవారం రాత్రి 10 గంటలకు పాగాలంకరణ సేవ, 12 గంటలకు స్వామిఅమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ముందుగా రాత్రి 7గంటలకు ఆలయ ప్రాంగణంలో నందివాహనసేవ, ఎదుర్కొలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి పవిత్రమైన రోజు కావడంతో ఆ రోజు రాత్రి లింగోద్భవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆ సమయాన మల్లికార్జునుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుంది. ఒకవైపు స్వామివారికి పాగాలంకరణ జరుగుతుండగా మరోవైపు గర్భాలయంలో జ్యోతిర్లింగమూర్తికి రుద్రాభిషేకం చేయడం విశేషం. ఏకాదశ రుద్రాభిషేకం ఉకదశ రుద్రులకు ప్రతీక. ఒక్కో అభిషేకంలో ఒక్కో రుద్రుడు ఆవిష్కృతమవుతాడు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు భ్రమరాంబా సమేత మల్లికార్జునుడికి బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తారు.



శ్రీశైల పురవీధిలో కిక్కిరిసిన భక్తజనం

గజ వాహనంపై మల్లన్న విహారం



గజ వాహన సేవలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

ఇల కై లాసమైన శ్రీశైల మహాపుణ్య క్షేత్రంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు మంగళవారం భ్రమరాంబా సమేతుడైన మల్లన్న గజ వాహనంపై విహరించారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో ఉత్సవ మూర్తులను గజవాహనంపై ఆశీనులు చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అర్చన, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం గజవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు సాగింది. జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు, డ్రమ్స్, డప్పులు, తప్పెట్లు, మేళతాళాలు, భజంత్రీలు, శంఖానాదాల కోలాహలం నడుమ గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. గజవాహనంపై దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. పూజల్లో కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణు చరణ్, శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాస రావు, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.



పాతాళ గంగలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు



ఉత్సవంలో ఆకట్టుకున్న వృషభం, అశ్వం



వీరభద్ర కళారూపం..



వేషధారణలో కళాకారులు



సింహవాహనంపై కొలువైన మహానందీశ్వరుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సింహ వాహనాధీశా... నమోస్తుతే!

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మహానంది క్షేత్రంలో మంగళవారం రాత్రి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి అమ్మవార్లు సింహ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్/డిప్యూటీ కమిషనర్ ఎం.రామాంజనేయులు, ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. అనంతరం కనుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు.పూజా కార్యక్రమాల్లో ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, దేవిక తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లు ఉదయం సూర్యప్రభ వాహనంపై కొలువై ఆలయ ప్రాకారాల్లో విహరించారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక



వీరంతా 1975లో పోలీస్ శిక్షణ పొందిన వారు. 50 సంవత్సరాల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను ఆనందంగా పంచుకున్నారు. విధి నిర్వహణలో ఎదుర్కొన్న సవాళ్లు, అనుభవాలను మిత్రులకు చెప్పారు. ఈ అ'పూర్వ' కలయికకు మంగళవారం కర్నూలు కొత్తపేటలోని పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ దగ్గర ఉన్న విశ్రాంత పోలీసు అధికారుల భవనం వేదిక అయ్యింది. వీరంతా హైదరాబాద్ అంబర్‌పేట ట్రైనింగ్ సెంటర్‌లో 1975లో శిక్షణ పొందారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో పనిచేస్తూ వివిధ హోదాల్లో పదోన్నతి పొంది పదవీ విరమణ చేశారు. ఆత్మీయతతో ఒక చోట చేరి మిత్రులను పలకరించారు. యోగక్షేమ విషయాలు తెలుసుకున్నారు. క్రమశిక్షణను గుర్తు చేసుకుంటూ హాస్యాన్ని పండించారు. – కర్నూలు

నీటి దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

నంద్యాల(అర్బన్): విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం జలాశయం నీటిని యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నా అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి విమర్శించారు. కృష్ణారెడ్డి యజామాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం రాయలసీమ సాగునీటి సామితి ఆధ్వర్యంలో పట్టణంలో రైతులతో భారీ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ, సీపీఐ, సీపీఎం, ముస్లింలీగ్, ఏఐకేఎస్, రైతు, వాణిజ్య, వర్తక, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టుకు 1562 టీఎంసీలకు వచ్చి చేరితే సాగర్‌కు హక్కుగా ఉన్న 264 టీఎంసీలు దిగువకు వదిలి మిగిలినవి శ్రీశైలంలో నిల్వ ఉంచాల్సి ఉందన్నారు. అయితే 1200 టీఎంసీల నీటిని సాగర్‌కు వదిలి శ్రీశైలాన్ని ఎండగట్టడం దారుణమన్నారు. చట్టాలను గౌరవించాల్సిన ప్రభుత్వం వాటి ఉల్లంఘనలకు పాల్పడటాన్ని ప్రజలు హర్షించబోరన్నారు. కర్నూలులోనే కేఆర్ఎంబీని ఏర్పాటు చేయాలని, రాయలసీమ ప్రజల ఆకాంక్షకు విరుద్ధంగా పాలకులు చర్యలు తీసుకుంటే సీమ వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేరిట రాసిన లేఖను నంద్యాల తహసీల్దార్ ప్రియదర్శినికి అందజేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వైఎస్‌రెడ్డి, సీపీఐ, సీపీఎం నాయకులు రంగనాయకులు, రాజశేఖర్, బాలీశ్వరరెడ్డి, బెక్కెం రామసుబ్బారెడ్డి, కొండారెడ్డి, సలాం, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమ శేఖర్‌రెడ్డి, సయ్యద్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే 'జీవన్ ప్రమాణ్'



జిల్లా ఖజానా అధికారి రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 18,707 మంది ప్రభుత్వ పెన్షన్‌దారులు ఉన్నారని, ఇప్పటి వరకు 15,701 మంది జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు జిల్లా ఖజానా అధికారి బి.రామచంద్రరావు తెలిపారు. ఇంకా 3,006 మంది వీటిని ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. కదల్లేని పెన్షన్ దారుల వివరాలు తెలియచేసినట్లయితే జిల్లా ఖజానా సిబ్బంది నేరుగా ఇంటికే వెళ్లి జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాన్ని ప్రభుత్వ యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తారన్నారు.పెన్షన్‌దారుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 28వ తేదీలోపు సమర్పించాలన్నారు. పెన్షనర్లు నేరుగా సబ్ ట్రెజరీ కార్యాలయాలకు వచ్చి బయోమెట్రిక్ వేసి సమర్పించవచ్చని, లేదంటే జీవన్ ప్రమాణ్ ప్రభుత్వ యాప్ ద్వారా సమర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు.

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్‌ను కోరిన ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి



జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు వీలుగా సత్వరం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి కోరారు. జేఏసీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలసి వివిధ సమస్యలపై చర్చించారు. అలాగే వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంగళ్‌రెడ్డి మాట్లాడుతూ... కొన్ని నెలలుగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం జరగడం లేదన్నారు. ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఫండ్ వినియోగంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 6, 7 తేదీల్లో మహిళాఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని సూచించారు. కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా సహ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రభుత్వం నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లీలావతి, బంగారి, వెటర్నరీ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, నగర కార్యవర్గ సభ్యులు సాయిరాం, రాఘవేంద్ర, చలపతి, మునీర్ అహ్మద్, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన ముగ్గురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: పట్టణంలోని ఎస్ఎల్వీ సినిమా థియేటర్ వెనుక వీధిలో నివాసం ఉంటున్న గుద్దేటి హరిణి ఆత్మహత్యకు కారకులైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్ఐ అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన షేక్ సాధిక్ ఉసేన్ అనే యువకుడు 2021లో హరిణిని కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి దాంపత్య జీవితం నాలుగేళ్ల పాటు సజావుగా సాగింది. ఇటీవల సాధిక్ ఉసేన్ ఇదే పట్టణానికి చెందిన మరో యువతిని వివాహం చేసుకున్నాడని తెలుసుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో నాలుగు రోజుల క్రితం భర్త, అత్త, మామలు, అవ్వపై పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి హరిణి బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి సోదరుడు శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు హరిణి ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్త సాధిక్ ఉసేన్, అత్తమామలు మహబూబ్‌బీ, జాఫర్ ఉసేన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫోర్జరీపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో పొలం పత్రాలు ఫోర్జరీ చేసి ఇతరుల పేరుపై రి జిస్ట్రేషన్ చేయించడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దుగాళ్ల సుబ్బమ్మ పేరుతో ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని పొలతల సుబ్బమ్మ పేరుతో ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. పెద్దుగాళ్ల రామేశ్వరయ్య ఫిర్యాదు మేరకు నాగేంద్రరెడ్డి, వెంకట్రామిరెడ్డితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పల్లె కన్నీరు పెడుతుందో..!

- పనుల్లేక వలసబాట పట్టిన పల్లె వాసులు
- 130 కుటుంబాలకు గాను 10 కుటుంబాలే జీవనం
- మొత్తం ఖాళీ అయిన గ్రామాలు



వలస వెళ్లడంతో ఇంటికి తాళం వేసిన దృశ్యం

కొత్తపల్లి: సందడిగా ఉండే గ్రామాలు నేడు వెలవెలబోతున్నాయి. పనుల్లేక ప్రజలంతా కన్నీరు పెడుతూ వలస వెళ్లారు. దీంతో పల్లెలన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఎర్రమఠం గ్రామ పంచాయతీలో పాత మాడుగుల, కపిలేశ్వరం, సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప మజరా గ్రామాలు ఉన్నాయి. సిద్ధేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాల్లో 130 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ అత్యధికంగా చెంచు గిరిజనులు ఉన్నారు. వీరి తోపాటు ఎస్సీలు, బీసీలు కూడా జీవిస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో 130 కుటుంబాలకు గాను 10 కుటుంబాలే ఉన్నాయి. ఈ గ్రామాల్లో ప్రజలు సమీపంలోని కృష్ణానదిలో జలాలు ఉన్నప్పుడు చేపల వేట చేస్తారు. నీళ్లు తగ్గుతున్న క్రమంలో కృష్ణానదీ ఒడ్డువెంట బయటపడుతున్న భూముల్లో ఆరుతడి పంటలతో వ్యవసాయం చేసుకొని జీనవనం సాగిస్తున్నారు. ఈ భూములపై 2016లో ఆంక్షలు విధిస్తూ 145 సెక్షన్ అమలుచేశారు. ఆ భూముల్లో ఎవరూ వ్యవసాయం చేయకూడదని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి నేటి వరకు నీటి ముంపు భూములను ఎవరు సాగుచేయడం లేదు. దీంతో ఆ గ్రామాల ప్రజలందరూ ఉపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. చాలా మంది పూర్తిగా గ్రామాలను ఖాళీ చేసి బతుకు జీవుడా అంటూ హైదరాబాద్‌కు వెళ్తుంటారు.



గ్రామస్తులు వలస వెళ్లడంతో ఖాళీగా దర్శనమిస్తున్న జానాల గూడెం

కుటుంబ పోషణ భారమై..

జనాల గూడెం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ చాలీచాలని జీతంతో ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అంగన్‌వాడీ టీచర్లకు ప్రతినెలా రెండు నుంచి మూడు సమావేశాలు ఉంటున్నాయి. అయితే జానాల గూడెంకు చెందిన అంగన్‌వాడీ టీచర్ నియోజకవర్గ సమావేశాలకు వెళ్లాలంటే సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంది. ఉదయం ఆరు గంటలకు బయలుదేరితే ఇంటికి చేరేలోపు రాత్రి పది గంటలు సమయం అవుతుంది. అలాగే సమావేశాలు ఉన్న రోజున తన భర్త కూలి పనులు వదులుకొని ఆమెతోపాటు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే ప్రత్యేక ఆటోలో వెళ్లాలంటే రాను, పోను వెయ్యి రూపాయల దాకా ఖర్చు అవుతుంది. సమావేశాలకే జీతం మొత్తం ఖర్చు అయి చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ భారమై పిల్లల ఉన్నత చదువుల కోసం ఖర్చులకు లేక కుటుంబమంతా కలిసి హైదరాబాద్‌కు ఉపాధి కోసం వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికైన జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఆ గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఉపాధి హామీ పనులు చూపించి వలసలు నివారించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో ఉన్న ప్రజలకు అధికారులు ఉపాధి హామీ పనులు చూపడం లేదు. వలసలను నివారించడంలో విఫలమవుతున్నారు. గ్రామాల్లో అధికంగా గిరిజనులు ఉన్నారు. ఐటీడీఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉపాధి పనులు కల్పించపోవడంతేనే వలసలు వెళ్లిపోయారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. – స్వాములు, సీపీఎం మండల కార్యదర్శి

శాశ్వత ఉపాధి చూపించాలి



మా గ్రామంలో అధిక కుటుంబాలు వలసలు వెళ్లాయి. పశువులు, జీవాలు ఉన్నవారు ఊర్లో ఉన్నారు. మా గ్రామాల్లో ఉన్న వారికి శాశ్వతంగా ఉపాధి చూపించాలి. ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకుంటే వలసలు నివారించవచ్చు. – సుధాకర్, జానాల గూడెం

బిక్కుమంటూ ఉంటున్నాం



మా చెంచు కాలనీలో ముసలోళ్లు తప్ప అందరూ పని కోసమని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఉన్న వారు మేకలు, గొర్రెలు, బర్రెలు మేపుకొనేందుకు అటవీకి వెళ్లి రాత్రి వస్తారు. అంతవరకు కేవలం ముగ్గురు ముసలోళ్ల మాత్రమే బిక్కు బిక్కుమంటూ ఉంటున్నాం. – లచ్చమ్మ, జానాల గూడెం

ఇదేమి ప్రచారం

- డొనేషన్ పేరుతో ఓ ప్రైవేట్ సంస్థ యాడ్ ప్రచురణ
- శ్రీశైల దేవస్థానం నిర్లక్ష్య వైఖరిపై మండిపడుతున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన మల్లన్న దర్శనానికి అనునిత్యం సామాన్యులే కాక వీఐపీలు, వీవీఐపీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సైతం తరలివస్తారు. అటువంటి మహాపుణ్యక్షేత్రంలో ఎటువంటి ప్రైవేట్ సంస్థల ప్రచారాలు నిర్వహించకూడదు. శ్రీశైల దేవస్థానానికి పలువురు దాతలు అన్నదానం, గోశాల నిర్వహణ, కాటేజీలు, వసతిగదుల నిర్మాణానికి విరాళాలు అందిస్తారు. స్వామి అమ్మవార్లకు బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు బహూకరిస్తారు. కానీ ఎవరు వారి వారి సంస్థలకు చెందిన ఎటువంటి ప్రచారాలు చేసుకోరు. కాగా ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు విచ్చేసే ఆయా శాఖలకు చెందిన పలువురు అధికారులు, సిబ్బందికి, మీడియా ప్రతినిధులకు, స్వచ్ఛంద సేవకులకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ గుర్తింపుకార్డులను దేవస్థానం మంజూరు చేశారు. ఈ డిజిటల్ కార్డులను ఓ ప్రైవేట్ సంస్థ స్పాన్సర్ చేసింది. అంతా బాగున్నా ..ఆ డిజిటల్ ఐడెంటీకార్డుల వెనుక ఆ ప్రైవేట్ సంస్థ ప్రచారాన్ని సైతం నిర్వహించుకుంది. ఇదే ఇప్పుడు క్షేత్రంలో పెద్ద చర్చ సాగుతుంది. దేవస్థానంలో ప్రైవేట్ సంస్థ ప్రచారం చేసుకోవడం ఏంటని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. అసలు ఆ సంస్థ ప్రచారం చేసుకునేందుకు అనుమతి ఎవరు ఇచ్చారని భక్తులు మండిపడుతున్నారు.

ఆలయంలోకి చెప్పులతో టీటీడీ బోర్డు మెంబర్!

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఓర్వకల్లు మండలం శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానంలో సాక్షాత్తూ టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ ఆలయంలో చెప్పులు వేసుకొని అధికారులతో కలిసి మహాశివరాత్రి వేడుకలను పర్యవేక్షించారు. అధికారులందరూ ఆలయంలోకి వెళ్లకముందే చెప్పులను వదిలి లోనికి వెళ్లారు. కానీ టీటీడీ బోర్డు సభ్యుడు మాత్రం చెప్పులు వేసుకొని మరీ ఆలయంలో కలియతిరిగారు. ఆయన వెంట కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్, సీఐ చంద్రబాబునాయుడు, ఈఓ మద్దిలేటి ఉన్నారు. ఘటనపై భక్తులు మండిపడుతున్నారు.



చెప్పులు వేసుకొని ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు రాజశేఖర్

పాగాలంకరణ పూర్వజన్మ సుకృతం

- పృథ్వీ సుబ్బారావుతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ



శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీశైల మల్లన్నకు లింగోద్భవ కాలాన నిర్వహించే పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. బ్రహ్మోత్సవ కల్యాణానికి ముందు మల్లికార్జున స్వామికి పాగాలంకరణ చేయడం సంప్రదాయం. ఈ సేవను ఒకే కుటుంబం వారసత్వంగా నిర్వహిస్తోంది. ఏటా మహాశివరాత్రి నాడు మల్లన్నకు తలపాగా చుడుతున్న దేవాంగ భక్తుడు పృథ్వి వెంకటేశ్వర్లు కుమారుడు సుబ్బారావు సతీసమేతంగా పాగాతో స్వామి సన్నిధికి చేరుకున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' ఆయనను పలకరించింది. పాగాలంకరణ విశేషాలు ఆయన మాటల్లో..

ప్రశ్న. పాగాలంకరణ ఎలా మొదలైంది? ఎప్పటి నుంచి చేస్తున్నారు?

పృథ్వీ: మా పెద్దలు ఇంటి దైవంగా కొలిచే మల్లన్న బ్రహ్మోత్సవాల్లో మహాశివరాత్రి నాడు స్వయంగా నేసిన పాగాను అలంకరించేవారు. నాలుగు తరాల నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. మొదట మా ముని తాతయ్య కందస్వామి, ఆ తరువాత మా తాత సుబ్బారావు, అటు తరువాత మా నాన్న పృథ్వీ వెంకటేశ్వర్లు పాగాలంకరణ చేశారు. ఆయన తరువాత నేను స్వామివారికి పాగాలంకరణ చేస్తున్నా. నా చిన్నప్పటి నుంచి పాగా తయారు చేస్తున్నా. మా పూర్వీకుల నుంచి సుమారు 70ఏళ్లకు పైగా ఈ ఆచారం కొనసాగుతోంది.

ప్రశ్న. పాగా నేసే విధానం ఎలా?

పృథ్వీ: స్వామివారికి పాగా ఎంతో భక్తి శ్రద్ధలతో నేస్తాం. ఇది ఒక దీక్ష. గతంలో ప్రతిరోజు ఒకమూర చొప్పున ఏడాది పాటు 365రోజులు 365మూరలు నేస్తాం. అయితే ప్రస్తుతం కమాసం ప్రారంభం నుంచి నేతను ప్రారంభించి శివరాత్రికి 10రోజుల ముందే మూర వెడల్పుతో 300 మూరలు పూర్తి చేస్తాం. మహాశివరాత్రి పండుగ రోజున కుటుంబ సమేతంగా వచ్చి సంప్రదాయబద్ధంగా పాగాలంకరణ చేస్తాం.

ప్రశ్న: మీ కుటుంబ నేపథ్యం?

పృథ్వీ: మాది ప్రకాశం జిల్లా చీరాల వద్ద హస్తినాపురం. మా అమ్మానాన్న పృథ్వీ వెంకటేశ్వర్లు, గౌరీకుమారి. నేను, మా చెల్లెలు మల్లీశ్వరి. ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. అందరం ఒకే ఇంట్లో ఉమ్మడిగా ఉంటున్నాం.

ప్రశ్న: పాగాలంకరణకు దేవస్థానం అందిస్తున్న సహకారం ఏంటి?

పృథ్వీ: ఏటా మహాశివరాత్రి నాడు మల్లన్నకు తలపాగా చుట్టాలని ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని దేవస్థాన అధికారులు అందజేస్తారు. పాగా వస్త్రంతో వచ్చినప్పుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతారు. భోజనం, వసతి, ప్రత్యేక దర్శనాలతో పాటు ఆర్థిక ప్రోత్సాహన్ని కూడా అందజేస్తున్నారు.

ప్రశ్న: మల్లన్నకు పాగా చుట్టే అవకాశం రావడం ఎలా ఉంది?

పృథ్వీ: మా పూర్వీకుల నుంచి ఈ ఆచారం వస్తుంది. కొట్లాది మంది భక్తులు ఇష్టదైవంగా కొలిచే మల్లికార్జున స్వామికి పాగాలంకరణ చేయడం మేము చేసుకున్న అదృష్టం. మల్లయ్యే మాకు ఈ అదృష్టాన్ని కల్పించారు.

ట్రాక్టర్ బోల్తా పడి మహిళ కూలీ దుర్మరణం

బొమ్మలసత్రం: నంద్యాల మండలం ఊడుమాల్పురం గ్రామ సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో పాణ్యం మండలం తొగర్చేడు గ్రామానికి చెందిన నాగమ్మ (48) దుర్మరణం చెందింది. ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా తెలిపిన వివరాల మేరకు.. తొగర్చేడు గ్రామానికి చెందిన 30 మంది మహిళా కూలీలు మంగళవారం పొగాకు కోసేందుకు ఊడుమాల్పురం గ్రామానికి ట్రాక్టర్‌లో చేరుకున్నారు. పని ముగించుకుని సాయంత్రం తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగమ్మ అక్కడికక్కడే మృతి చెందగా 10 మంది గాయపడ్డారు. గాయపడిన కూలీలను చాపిరేవుల పీహెచ్‌సీ సెంటర్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి కుమార్తె అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పశుగ్రాసం దగ్ధం

కొత్తపల్లి: మండల కేంద్రంలో పశువుల మేత కోసం నిల్వ ఉంచిన పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామానికి చెందిన ప్రాతకోట వెంకటరమణ, జి. మల్లయ్య సుమారు 40 ట్రాక్టర్ల వరిగడ్డిని లింగాపురం గ్రామం వెళ్లే దారిలోని కల్లం దొడ్డికి తరలించారు. ఆ గడ్డిని వాములు వేసేందుకు వేయడం ప్రారంభించారు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్లారు. అయితే ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి క్షణాల్లో పశుగ్రాసం దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పక్కనే ఉన్న గడ్డివాములకు ప్రమాదం తప్పింది. దాదాపు రూ. 2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.

విద్యాభివృద్ధికి ఏటా రూ.12 లక్షల సహాయం

- రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ కరీం

వెలుగోడు: విద్యాభివృద్ధికి ఏటా రూ. 15 లక్షలు సహాయం అందిస్తున్నామని ఫౌజియా కరీం ఫౌండేషన్ చైర్మన్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ముల్లా అబ్దుల్ కరీం తెలిపారు. వెలుగోడు జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం ఫౌజియా కరీం ఫౌండేషన్ స్కాలర్‌షిప్ పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముల్లా అబ్దుల్ కరీం మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత ఆశయాలు, లక్ష్యాలు కలిగి ఉండాలన్నారు. ఉర్దూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 97 శాతం మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. వక్తలు నసురుల్లా ఖాన్, హిదాయత్ అలీ ఖాన్, సుల్తాన్ మొహిద్దిన్‌లు మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఆత్మకూరు, వెలుగోడు విద్యార్థుల బుక్స్, బ్యాగులనుఅందించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు గౌరవ వేతనం, కళాశాల అభివద్ధికి నిధులకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. అంజుమన్ ప్రెసిడెంట్ మోమిన్ రసూల్, మైనార్టీ నాయకులు ఖలీల్ ఖాన్, సయ్యద్ బాషా, డాక్టర్ ముల్లా అబ్దుల్ ఆఫ్రిద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న కరీం

మార్కెట్‌లో ధర లేకపోవడంతో వంకాయ పంటను గొర్రెలకు వదిలేసిన దృశ్యం



పంట గొర్రెల పాలు

దేవనకొండ: రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. అమ్మబోతే అడవి.. కొనబోతే కొరవిలాగా రైతుల పరిస్థితి మారింది. రూ.వేలకు వేలు పెట్టుబడి పెట్టి పండించిన వంకాయలు మార్కెట్‌లో 20 కిలోల బస్తా ధర రూ.20 పలకడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కనీసం దానిని తీసిన కూలి కూడా గిట్టుబాటు గాక గొర్రెలకు వదిలేస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో గోవిందు అనే రైతులు ఎకరం పొలంలో వంగతోట సాగు చేశాడు. ఇందుకు రూ.60వేలు ఖర్చు చేశాడు. పంట చేతికి రాగా.. బయట మార్కెట్‌లో బస్తా రూ.20 కిలో విక్రయిస్తే కేవలం రూ.2లే దక్కడంతో పంటలను గొర్రెలకు వదిలేశాడు. ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

శివయ్య లీలలు.. ఎంత వి'చిత్రమో'



పురాణాల్లో శివయ్య లీలలు ఎన్నో ఉన్నాయి. వాటిని మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు పరమశివుడి గురించి ప్రధాన ఘట్టాలు సూక్ష్మ చిత్రాలుగా ఆవిష్కరించారు. శివుడు యమధర్మరాజు నుండి తన భక్తుడైన మార్కండేయుని కాపాడటం, శ్రీరాముడు రావణాశురుడిని వధించిన తర్వాత బ్రాహ్మణ హత్యాదోశం నుండి విముక్తి పొందాలని శివున్ని పూజిస్తున్నట్లు హనుమంతుడు రామకార్యం విజయవంతం కావాలని శివున్ని ఆరాధిస్తున్నట్లు శ్రీకాళహస్తి, శ్రీ అంటే సాలేపురుగు, కాల అంటే సర్పం, హస్తీ అంటే ఏనుగు ఈ మూడు జీవాలు భక్తితో శివుడికి పూజ చేయడం లంకాధిపతి రావణాశురుడు శివలింగం వద్ద తపస్సు చేయడం, క్షీర సాగర మదనం నుంచి వచ్చిన విషాన్ని లోక కల్యాణం కోసం శివుడు సేవిస్తుండటం, అర్జునుడు శివున్ని ధ్యాన్నించి పాశుపతాస్త్రం పొందినట్లు, ఛత్రపతి శివాజీ మహారాజ్ పరమ శివ భక్తులు శివలింగాన్ని పూజిస్తున్నట్లు, భక్త కన్నప్ప బాణపు మొనతో కంటిని తీసి శివలింగానికి పెట్టడం, కుమారస్వామి, గణపతి స్వాములు ఆది దంపతులు పూజిస్తుండటం, పరమ భక్తులైన అక్క మహాదేవి ఆది శంకరాచార్యులను చిత్రంలో చూపించారు.

– నంద్యాల(అర్బన్)

జేసీబీ ఢీకొని వ్యక్తి మృతి

ప్యాపిలి: స్థానిక పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి జేసీబీ ఢీకొని ప్యాపిలికి చెందిన వడ్డే గోపాల్ (56) మృతి చెందాడు. పని మీద బయట కు వచ్చిన అతను ఇంటికెళ్తుండగా ప్రమాదవశాత్తూ జేసీబీ ఢీకొనడంతో కింద పడ్డాడు. అతనిపై జేసీబీ టైర్లు ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టమాట ఆటో బోల్తా

బనగానపల్లె రూరల్: యాగంటిపల్లె సమీపంలోని గాలేరు-నగరి సుజల స్రవంతి కాల్వ సమీపంలో టామాట లోడ్డుతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఆళ్లగడ్డకు చెందిన ఆటో డ్రైవర్ శివ వివరాల మేరకు.. మంగళవారం పసుపల గ్రామం నుంచి టమాట బాక్సులు వేసుకుని ట్రాలీ ఆటో బనగానపల్లె వైపు వస్తోంది. యాగంటిపల్లె సమీపంలోని జీఎన్ఎస్ఎస్ కాల్వ వద్ద ఎదురుగా వస్తున్న బర్రెలను తప్పించబోయి ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కలో లోతైన గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంతో శివకు స్వల్ప గాయాలయ్యాయి.

గవర్నర్‌కు వీడుకోలు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీడ్కోలు పలుకుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతుల రెండు రోజుల శ్రీశైలం పర్యటన ముగిసింది. శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న గవర్నర్ దంపతులు మంగళవారం ఉదయం గం.11:35 తిరిగి విజయవాడకు బయలు దేరి వెళ్లారు. వారికి సున్నిపెంట హెలిపాడ్‌లో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ సి.విష్ణుచరణ్ వీడ్కోలు పలికారు.